క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుభాషిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సెల్: 9959226292 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

కొల్లాపూర్: ఆర్టీసీ డిపోకు సంబంధించిన సమస్యలు, సలహాల స్వీకరణ కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం ఉమాశంకర్ వెల్లడించారు. సెల్ : 9000405878 ను సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



పెంట్లవెల్లి: ఆరు గ్యారంటీ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా మల్లు రవిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడ్డారని గుర్తు చేశారు. డిష్ రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ నాయుడు, కారంగి ఈశ్వరయ్య, నరేష్, రాజులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధిస్తున్నట్లు ప్రచారం చేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పూర్తి విచారణ చేసి పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మహేష్, రాహుల్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

బాలాజీకి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి


కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజీ సింగ్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ముస్లిం మైనారిటీలు కోరారు. బుధవారం బాలాజీ సింగ్ నివాసంలో వారు ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పహడీ షరీఫ్ దర్గాలో చాదర్ సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాలాజీకి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



పెద్దకొత్తపల్లి: ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లు నిబంధన మేరకు ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రమేష్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని మనగ్రో మోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువుల బస్తాలు, క్రిమిసంహారక మందులను తనిఖీ చేశారు. దుకాణాల ఎదుట స్టాక్ బోర్డుపై వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులు వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన క్రిమిసంహారక మందులనే వాడాలన్నారు. ఏఈఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

కంది క్వింటా రూ.9,301



కల్వకుర్తి: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కందులకు రూ.9,301 ధర లభించింది. వేరుశనగకు రూ.7,009 అత్యధిక ధర లభించగా, మధ్యస్తంగా రూ.6,001, తక్కువగా రూ.5,070 ధర లభించింది. 84 మంది రైతులు 2,728 బస్తాల్లో 819 క్వింటాళ్ల వేరుశనగను అమ్మకానికి తీసుకొచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు చెప్పారు.



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో



తాడూరు మండలం అల్లాపూర్‌లో



దోమల పెంట డీఏవీ పాఠశాలలో..

ఆకట్టుకున్న ప్రదర్శనలు

- సైన్స్‌ఫేర్‌తో మేధాశక్తి మెరుగు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం గీతం పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వివిధ నమూనాలను ఉపాధ్యాయులు తిలకించారు.

కల్వకుర్తి టౌన్: వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధాశక్తితో పాటు సృజనాత్మకత పెంపొందుతుందని ఎంఈఓ బాసునాయక్ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ నాగార్జున, ఎంఈఓ హాజరయ్యారు.

తెలకపల్లి: విద్యార్థులు బాగా చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఏఓ సందీప్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మౌనికలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని కేకేరెడ్డి పాఠశాల, సిద్ధార్థ పాఠశాల, ఎస్ఆర్ పాఠశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాలలో సోలార్ సిస్టం, వాటర్ ఫిల్టర్, చంద్రయాన్–3, రోడ్డు ప్రమాదాలు నివారణ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కేకేరెడ్డి పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో 18 ప్రయోగాలు ప్రదర్శించారు. ఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థులు శాస్త్రవిజ్ఞానానికి సంబంధించి కృత్యాలను తయారు చేసి ప్రదర్శించారు.

దోమలపెంట: జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని ఈగలపెంటలో బుధవారం టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో విద్యార్థులు పలు విజ్ఞాన ప్రదర్శనలను ప్రదర్శించారు. భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, సివిల్ ఎస్ఈ రవీంద్రకుమార్, ఈఈ రమేష్, ఇంజినీర్లు విజ్ఞాన ప్రదర్శనలను తిలకించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, సైన్స్ టీచర్లు చైతన్య, ప్రతిభ, సులోచనలు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా గీతం పాఠశాలలో సైన్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల పండ్ల ఆకారాలను తయారు చేశారు.

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో సైన్స్, గణితం, తెలుగు అంశాలతో కూడిన క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ అధికారి చంద్రశేఖర్ జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు సరళ, అంబిక, అంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని లింగాల, అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రంగవల్లులు, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

కోడేరు: మండల కేంద్రంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో విద్యార్థులు సీడ్ మైగ్రేషన్, చంద్రయన్–3, మ్యాజికల్‌ఫైర్, వాటర్ క్లోరినేషన్, ఎయిర్‌ప్రేజర్, తదితర ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

అమ్రాబాద్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీరాంలను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



లింగాల ఉన్నత పాఠశాలలో



అమ్రాబాద్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో



కల్వకుర్తి బ్రిలియంట్ పాఠశాలలో

ఘనంగా డిపో ఆవిర్భావ వేడుకలు



కొల్లాపూర్: సంస్థ అభివృద్ధి కోసం ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్ కోరారు. కొల్లాపూర్‌లో డిపో ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బుధవారం డిపోలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి, సిబ్బందికి పంచిపెట్టారు. డిపో అభివృద్ధిలో సిబ్బంది భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ యాదయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ నజీర్, ప్రభాకర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ

లింగాల: మోకాలు శస్త్ర చికిత్సన కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చేరిన లింగాల ఎంపీపీ కె.లింగమ్మను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగినేని శ్రీనివాస్‌రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కూలీల సంఖ్య పెంచాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులను చేసేందుకు కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జ్యోతి ఫరూసియా కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా పనుల వివరాలను మస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

ట్రాక్టర్లపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రెండు ఇసుక ట్రాక్టర్లు అనుమతి లేకుండా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తుండగా దేశిటిక్యాల శివారులో పోలీసులు గుర్తించి ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ధ్వజస్తంభ, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చరణ మధ్య ఊరేగించారు. మహాపూర్ణాహుతి, మహాహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెండె మల్లేష్ యాదవ్, రామచంద్రయ్య యాదవ్, కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

కూలీల హాజరు వివరాలు తప్పనిసరి



చారకొండ: ఉపాధి హామీలో భాగంగా కూలీలు రోజు పని చేసిన వారి వివరాలను తప్పనిసరిగా మస్టర్‌తో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో బుధవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. పనుల్లో కూలీలు చేయాల్సిన వాటిపై వివరించారు. కూలీలు వేసవిలో పనులు చేపట్టడంతో తగు జాగ్రతలు పాటించాలని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు రవిశంకర్, గణేష్ తదితరులు ఉన్నారు.

అమరగిరిలో ఎన్ఎస్ఎస్ క్యాంపు




ఎన్ఎస్ఎస్ క్యాంపును ప్రారంభిసున్న పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ మార్కుపోలోనియస్

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో బుధవారం ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ స్పెషల్ కాంపును ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కుపోలోనియస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అమృత్ కుమార్, డాక్టర్ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు సతీష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బిచ్చన్న మాజీ సర్పంచ్ నిరంజన్, బీజేపీ నాయకులు భరత్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపక, బోధనేతల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

పెంట్లవెల్లి: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరుచేయాలని బుధవారం తహసీల్దార్ హిమబిందుకు సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డు లేక ప్రభుత్వం పథకాలకు దూరం అవుతున్నారని వివరించారు. జిల్లా నాయకుడు ఈశ్వర్, చిట్టమ్మ, రామస్వామి, రాజు, కృష్ణలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన

కల్వకుర్తి టౌన్: పట్టణంలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 1,558 మంది విద్యార్థులకు గాను 1,473 మంది హాజరుకాగా 98 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను చేసినట్లుగా కల్వకుర్తి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 131 మంది విద్యార్థులకు గాను 129 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామని కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ రావు తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్‌హైస్కూల్ 214 మంది విద్యార్థులకు 203 హాజరుకాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 162 మంది విద్యార్థులకు 159 హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పుష్పలత పేర్కొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రలో 391 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 37 మంది విద్యార్థులు గైర్హజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బళ్ళారి శేఖర్ తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



వెల్దండ: మండలంలోని ఒంటిగుడిసెతండా, ఉసికబోర్డుతండాలో బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ పత్యానాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో మొదటి వార్డులో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, శిశుపాల్‌రెడ్డి, అంజనేయులు, రామస్వామి, కిష్టాల్, బాబా, శ్రీనివాసులు, వెంకటయ్య, ఓలియోద్దీన్, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, డీపీఎం నర్సింహులు, ఎల్‌హెచ్‌ఎస్ ఏపీఎం సహదేవుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సంఘం అసిస్టెంట్లకు, వీఓఏలకు లక్‌పతీ దీదీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్‌పతి దీదీపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘం నుంచి రుణాలు, గ్రామ సంఘం నుంచి రుణాలు, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, సీఐఎఫ్, అంతర్గత రుణాలు తీసుకుని జీవనోపాధి ఎంపిక చేసుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం నిరంజన్, సీసీలు నర్సింహా, సుగుణయ్య,సుజాత, వీఓఏలు ఖాజాజీ, విజయ, అరుంధతి, మల్లేష్, గిరిజ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ

ఓటు హక్కు వజ్రాయుధం



అమ్రాబాద్: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ఉపాధిహామీ పథకం ఏపీడీ శ్రీనివాసులు అన్నారు. జాతీయ సేవపథకం ద్వారా బుధవారం అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఓటరు నమోదు, ఓటు హక్కు పై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటు హక్కు వినియోగం, కొత్త ఓటర్ల నమోదు ఫారం 6, 7, 8 గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటుతోనే మంచి పరిపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో డీఏపీఓ వెంకటయ్య, డీపీఎం లక్ష్మయ్య, మల్లేషం, ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

పట్టుదలతోనే లక్ష్య సాధన



కల్వకుర్తిరూరల్: పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శోభన్ బాబు, నర్సిరెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు దైవంతో సమానం



కల్వకుర్తి: తల్లిదండ్రులు దైవంతో సమానమని అరబిందో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆ పాఠశాలలో 9,10వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పాదాలను కడిగి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పలువురు వక్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో బహుమతి



కందనూలు: తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్ర అటవీ, పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి' అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర అటవీ పర్యావరణ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, వరంగల్ కలెక్టర్ స్మితా పట్నాయక్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ మెరుపాక మహేష్ చేతుల మీదుగా కన్సోలేషన్ బహుమతి పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దీపిక అందుకున్నారు. బుధవారం వరంగల్‌లోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో సైన్స్ దినోత్సవం సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర స్థాయికి ఐదు కవితలు ఎంపిక కాగా.. అందులో వెన్నచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని దీపిక రాసిన కవితకు, గైడ్ టీచర్‌గా వ్యవహరించిన టీ.రాజశేఖర్ రావుకు కన్సోలేషన్ బహుమతిని అందుకున్నట్లు డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని దీపికను, గైడ్ టీచర్ రాజశేఖర్‌ను డీఈఓ గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తాడూరు: మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న మాజీ సర్పంచ్ చిన్న రాములు మాట్లాడుతూ విద్యార్థులు దాతల ఇచ్చే సహాయ సహకారాలను వినియోగించుకుని చదువులో బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శేషగిరి, క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్ఐడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో డీఈఓగా విద్యార్థిని సుమతి, ఎంఈఓగా విద్యార్థిని గాయిత్రి, కాంప్లెక్స్ హెచ్ఎంగా పూజ, పాఠశాల హెచ్ఎంగా భరత్‌తో పాటు మొత్తం 23 విద్యార్థులు ఉపాధ్యాయులగా వ్యవహరించారు.

లింగాల: మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎంగా నీరజ, డీటీడీఓగా అనూష, ఏటీడీఓగా నర్మదతో పాటు మరో 56 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

పెద్దకొత్తపల్లి: గంట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా బి అనిత, కలెక్టర్‌గా జి నందిని,డిఎస్ఈగా గీతిక, ఆర్‌జేడీగా లావణ్య, డీఈఓగా వంశీ, ఎంఈఓగా వెంకటేష్, 20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

కోడేరు: మండలంలోని ఎత్తం ప్రాథమికోన్నత పాఠశాల, కొండ్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం బాల కృష్ణయ్య, నిర్మల, ఉపాధ్యాయులు కిషోర్‌గౌడు, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి గంట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు